## క్లుప్తంగా

### 18న జాతర



సమావేశంలో మాట్లాడుతున్న తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి

చెన్నేకొత్తపల్లి: తోపుదుర్తి గ్రామంలో ఈ నెల 18న నిర్వహించనున్న పెద్దమ్మ జాతర (ఊరదేవర)కు మండలంలోని ప్రజలు తరలిరావాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల్లోని గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి పార్టీ నాయకులు, కార్యకర్తలను ప్రజలకు కరపత్రాలు అందజేసి, ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గోవిందరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహా రెడ్డి, పలువురు సర్పంచ్‌లు నాయకులు పాల్గొన్నారు.

### దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టొద్దు

తలుపుల: స్థానిక సచివాలయం -1ను ఎంపీడీఓ రామానాయక్ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేసి ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టకుండా పరిష్కరించాలని సూచించారు. ఇటీవల జరిగిన పింఛన్ల వారోత్సవాల్లో తనకు పింఛన్ అందలేదని బలిజపేటకు చెందిన వెంకటలక్షమ్మ ఫిర్యాదు చేసిన నేపథ్యంలో రికార్డులు పరిశీలించారు. పింఛన్ కోసం ఆమెపేరును ఆన్‌లైన్‌లో నమోదు చేయించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

### విజయంతో తిరిగి రండి



విద్యార్థులను అభినందిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి

ధర్మవరం అర్బన్: కేరళలోని మంగళూరు వర్సిటీలో ఈనెల 12న ప్రారంభం కానున్న ఆల్ ఇండియా బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటి జిల్లాకు పేరు తీసుకురావాలని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ఎస్కే యూనివర్సిటీ జట్టు తరఫున ఎంపికై పోటీలకు వెళ్తున్న డిగ్రీ విద్యార్థులు దీపక్‌కుమార్, వినయ్‌ను మంగళవారం ఆయన అభినందించి వీడ్కోలు పలికారు. పీడీ ఆనంద్, అధ్యాపకులు అభినందించారు.

### వైఎస్సార్‌సీపీలో బడుగులకు సముచిత స్థానం



కుళ్లాయినాయక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నల్లమాడ: వైఎస్సార్ సీపీలో బడుగులకు సముచిత స్థానం లభిస్తుందని నాయకులు అన్నారు. నల్లమాడ మండల కన్వీనర్‌గా నియమితులైన దుంగావత్ కుళ్లాయినాయక్‌ను మంగళవారం సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌హెచ్ బాషా, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొరకల రమణ, పట్టణ కన్వీనర్ వేణుగోపాల్ గౌడ్, వైస్ ఎంపీపీ కే.సూర్యనారాయణ, సర్పంచ్ బొజ్జేనాయక్, నాయకులు దుద్దుకుంట వెంకటరెడ్డి పాల్గొన్నారు.

### రేపటి నుంచి ఉపాధి పనులు

తలుపుల: లక్కసముద్రం పంచాయతీ బాలిరెడ్డిపల్లి గ్రామంలో గురువారం నుంచి కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తామని ఎంపీడీఓ రామానాయక్ తెలిపారు. గురువారం ఆయన గ్రామాన్ని సందర్శించి ఉపాధి సిబ్బందితో మాట్లాడారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో పనులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఉపాధి సిబ్బందిని హెచ్చరించారు.

# పేదల ఉన్నతికి పథకాలు దోహదం

- ఎమ్మెల్యేలు డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి





సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి, ఇంటి లబ్ధిదారు సమస్యపై ఫోన్‌లో అధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

తనకల్లు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల ఉన్నతికి దోహదం చేస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండల పరిధిలోని మారెప్పగారిపల్లి, శివాజీపురం, బాల సముద్రం గ్రామాల్లో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే ఇంటింటా తిరుగుతూ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వలంటీర్ల ద్వారా పథకాలు సక్రమంగా అందుతున్నాయని లబ్ధిదారులు తెలిపారు సీసీ రోడ్లు, ఇంటి స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయించాలని మారెప్పగారిపల్లికి చెందిన పలువురు ఎమ్మెల్యేకు విన్నవించారు. బాలసముద్రం రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షపునీరు నిలబడకుండా చూడాలని, హిందువుల శ్మశాన వాటికకు స్థలం చూపాలని, శివాలయం వద్ద కల్వర్టు నిర్మించాలని, సీబీఎన్ కాలనీలో తాగునీటి సమస్యను తీర్చాలని ఎంపీటీసీ అమర్ ఎమ్మెల్యేను కోరారు. కొక్కంటిక్రాస్‌లో వారపు సంత ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు అయ్యేలా చర్యలు తీసుకున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలవాలన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఆడుతున్న డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని, వారికి వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ పూల నరసింహులు, సర్పంచులు రామచంద్రారెడ్డి, సురేష్‌రెడ్డి, నాగేంద్ర, ఎంపీటీసీ హిమధర్ రెడ్డి, అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ కొండా మల్లికార్జున,నాయకులు శ్రీనివాసులనాయుడు, పోలం సిద్దారెడ్డి, బాబాఫకృద్దీన్, రహంతుల్లా, తాహీర్, శ్రీరాములు, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**అర్హులందరికీ సంక్షేమ పథకాలు**

ధర్మవరం: ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు దృష్టి సారించామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని 31వ వార్డులో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యుత్ సరఫరా చేయాలని అక్కమ్మ దేవాలయం వద్ద ఇళ్లు నిర్మించుకున్న పేదలు ఎమ్మెల్యేకు ప్రజలు విన్నవించారు. తగు చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులను ఎమ్మెల్యే సూచించారు. కాలనీలోని శివారులో ఉన్న ఇళ్లకు తాగునీటి సదుపాయం కల్పించేందుకు పైపులైన్లు వేయాలని ఎమ్మెల్యేకు ప్రజలు విన్నవించారు. రెండు, మూడు ఇళ్లు ఉంటే పైపులైను వేయలేమని, చాలా ఇళ్లు ఉంటేనే నీటి సదుపాయం కల్పిస్తామని ఎమ్మెల్యే సూచించారు. వార్డులో రహదారులు, కాలువలు నిర్మించాలని కాలనీవాసులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లు ఏవిధంగా పని చేస్తున్నాయి? పాఠాలు నేర్చుకుంటున్నారా అని ట్యాబ్ ఉపయోగిస్తున్న ఓ విద్యార్థినిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలులో భాగంగా అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. వాటిని క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చూడాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ యర్రగుంట్ల భాగ్యలక్ష్మి, వార్డు ఇన్‌చార్జ్ తోపుదుర్తి వెంకట్రాముడు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ



పాముదుర్తిలో క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పుట్టపర్తి: ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు బుక్కపట్నం మండలం పాముదుర్తిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి తదితరులు మంగళవారం వైఎస్సార్ సీపీ క్యాలెండర్లను ఆవిష్కరించి పంపిణీ చేశారు. జిల్లా యూత్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, మండల అగ్రీ అడ్వైజరీకమిటీ చైర్మన్ వెంకట చౌదరి పాల్గొన్నారు.

కొత్తచెరువు: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి సహకారంతో ముద్రించిన నవరత్నాల క్యాలెండర్లను కొత్తచెరువులోని పంచాయతీ కార్యాలయ ఆవరణంలో మంగళవారం వైసీపీ నాయకులు ఆవిష్కరించారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన పథకాలన్నింటిని పొందుపరచి ఈ క్యాలెండర్లను ప్రజలకు అందజేస్తామని నాయకులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, మటన్ శంకర, నాగరాజు, టౌన్ కన్వీనర్ భాస్కర్, నాయకులు అంగడి సోమశేఖర్ రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

## ఎకరాకు రూ.3.93 లక్షలు చెల్లిస్తాం

ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సుధారాణి



అర్జీలు తీసుకుంటున్న ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్

ఎన్పీకుంట: జీఎన్ఎస్ఎస్ నుంచి హెచ్ఎన్ఎస్ఎస్ వెలిగల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న మరికొమ్మదిన్నె రైతులకు న్యాయం చేయాలని బాధిత రైతులు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సుధారాణికి విన్నవించుకున్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నష్టపరిహారంపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ నిర్వహించారు. మరికొమ్మదిన్నె పరిసర ప్రాంతంలో భూసేకరణలో భాగంగా పట్టా పాసు పుస్తకాలు ఉన్న సుమారు 32 ఎకరాలకు సంబంధించి ఆయా రైతులకు నోటీసులు ఇచ్చామని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సుధారాణి తెలిపారు. భూసేకరణ చట్టం -2013 నిబంధనల ప్రకారం భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.3,93,907 చెల్లిస్తారని పేర్కొన్నారు. రైతులు మాట్లాడుతూ తమకు వ్యవసాయమే జీవనాధారమని, భూములు కోల్పోతే చిన్న, సన్నకారు రైతులు జీవనాధారం కోల్పోతామని వాపోయారు. తక్కువ నష్టపరిహారానికి తమ భూములు ఇవ్వలేమన్నారు. బోరు బావుల కింద పొలాలకు ఎకరాకు రూ.10 లక్షలు, వర్షాధారంతో పండించే భూములకు రూ.8 లక్షలు నష్టపరిహారం చెల్లించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయాన్ని జేసీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవినాయక్, డీటీ ఇంతియాజ్‌అహ్మద్, ఆర్ఐ యువతేజ, ఇరిగేషన్ ఎఈ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఉపాధి హామీ పనులు



సమావేశంలో పాల్గొన్న ద్వామా పీడీ రామాంజినేయులు,

ఓడీ చెరువు: జాతీయ ఉపాధి హామీ పనులు పారదర్శకంగా చేపట్టి కూలీలందరికీ పనులు కల్పించాలని డ్వామా పీడీ రామాంజినేయులు సూచించారు. ఉపాధి హామీ పథకం కింద 2021-22, 2022-23లో మండల వ్యాప్తంగా రూ.24 కోట్లతో చేపట్టిన పనులపై జరిగిన సామాజిక తనిఖీల్లో వెల్లడైన అంశాలను ప్రజలకు వివరించేందుకు స్థానిక ఎస్సీ హాస్టల్ ప్రాంగణంలో మంగళవారం ప్రజావేదిక నిర్వహించారు. ఎంపీపీ ఫర్వీన్‌బాను అధ్యక్షత వహించారు. జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఏపీడీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. మొత్తం పనుల్లో రూ.7,367 అవినీతి జరిగినట్లు వెల్లడించారు. ఆ సొమ్మును రికవరీ చేయించినట్లు విజిలెన్స్ అధికారి రమణారెడ్డి తెలిపారు. టెక్నికల్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు చేసిన పొరపాట్లను గుర్తించి వారికి రూ. 25 వేల జరిమానా విధించారు. 15 రోజుల్లో ఈ మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించాలని సూచించారు. ఎంపీడీఓ పోలప్ప, ఎస్ఆర్పీ లక్ష్మీనారాయణ, జేఈ గుప్తా పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి టౌన్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు సీఎం వైఎస్ జగన్ విద్యారంగంలో సంస్కరణలు తెచ్చారని ఎమ్మెల్యే సిద్దారెడ్డి అన్నారు. వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రూపొందించిన నూతన క్యాలెండర్‌ను మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విద్యాకానుక, జగనన్న గోరుముద్ద తదితర పథకాలతోపాటు ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ ఇంద్రప్రసాద్, రాష్ట్ర నాయకులు జంషీద్, గంగాధర్‌రెడ్డి, జిల్లా నాయకులు సుదర్శన్‌రెడ్డి, శివయ్య, శ్రీనివాసులు, జమీర్, రఘునాథ్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, ఓబులేసు, బాలక్రిష్ణ రెడ్డి, అంజనేయులు, లక్ష్మీపతిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

కనగానపల్లి: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న బండ్లపల్లి మదన్‌మోహన్‌రెడ్డిని గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని అసిస్టెంట్ ప్రొఫెసర్ వసంత కవిత తెలిపారు. టీచింగ్ కమ్యూనిటీ సభ్యులు తలమర్ల సంజీవరెడ్డి, కనగానపల్లి సుధాకర్, భాస్కరరెడ్డితో కలిసి ఆమె మంగళవారం కేజీబీవీ, జెడ్పీ పాఠశాలలతో పాటు ముత్తవకుంట, మామిళ్లపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు.

### కేంద్రప్రభుత్వ విధానాలపై సీఐటీయూ నిరసన




ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

పుట్టపర్తి: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వైఖరికి వ్యతిరేకంగా అంగన్‌వాడీలు, కార్మికులతో కలిసి మంగళవారం సీఐటీయూ నాయకులు ఉద్యమించారు. జిల్లా నాయకుడు గౌస్ లాజం, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, బ్యాళ్ల అంజి ఆధ్వర్యంలో బుక్కపట్నం, కొత్తచెరువులో ర్యాలీ నిర్వహించారు. కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ విధానాలను తప్పు పట్టారు.దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచి పెడుతున్నారని విమర్శించారు. అనంతరం సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి టీచర్స్ షటిల్ టోర్నీ

ధర్మవరం అర్బన్: స్థానిక ఎమ్మార్సీ మైదానంలో బుధవారం నుంచి టీచర్స్ షటిల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గిద్దలూరు క్రిష్ణప్రసాద్ తెలిపారు. కాగా మొదటి బహుమతికి సంబంధించిన మొత్తాన్ని మొదటి బహుమతిగా అందజేయాల్సిన రూ.10వేల మొత్తాన్ని క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డె బాలాజీ నిర్వాహకులకు అందించారు.

## భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి పూజలు



ఓంకారేశ్వరుడు, గణపతికి అలంకరణ

బత్తలపల్లి: శ్రీలలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వరుని ఆలయంలో మంగళవారం సంకటహర చతుర్థి పూజలను ఆలయ ప్రధాన అర్చకులు కేశవస్వామి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఓంకారేశ్వరుడు, గణపతికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

### కందిలో పంట కోత ప్రయోగం

ఎన్పీకుంట: గోవిందురాజులపల్లి, పెదరాంపల్లి, పులగూరవాండ్లపల్లి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ అధికారులు కందిపంటలో పంటకోత ప్రయోగం చేపట్టారు. ఎకరాకు రెండు క్వింటాళ్ల దిగుబడి రావచ్చని వ్యవసాయ అధికారి లోకేశ్వరరెడ్డి అంచనా వేశారు. వీఏఏ నరసింహారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

పుట్టపర్తి: బుక్కపట్నం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త చింతకాయల నారాయణ(72) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి మంగళవారం వెళ్లి నారాయణ భౌతిక కాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.6వేల ఆర్థిక సహాయం అందించారు. పతంజలి,నీలూరి ఈశ్వర్,నాగభూషణ పాల్గొన్నారు.

### వాహనాల వేలం



వేలం నిర్వహిస్తున్న దృశ్యం

తాడిమర్రి: వివిధ నేరాల్లో పట్టుబడిన రెండు బైక్‌లు, ఒక సూపర్ ఎక్సెల్, ఒక టీవీఎస్ వాహనాలకు స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం వేలంపాట నిర్వహించారు. నాలుగు వాహనాలకు రూ.60 వేలు ఆదాయం లభించిందని ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ తెలిపారు.

### సమయ పాలన పట్టదా?

ఎన్పీకుంట: గొకనపల్లి, మరికొమ్మదిన్నె సచివాలయాలను మంగళవారం ఎంపీడీఓ ఆదినారాయణ తనిఖీ చేశారు. ఉదయం 10.30 గంటలైనా గొకనపల్లి సచివాలయ సిబ్బంది హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నోమార్లు చెప్పినా మార్పు రాలేదని మండిపడ్డారు. సమయ పాలన పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మరికొమ్మదిన్నె సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది హాజరును పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

### ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే

కదిరి: ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని వక్తలు పేర్కొన్నారు. స్థానిక ఎన్జీఓ హోంలో మంగళవారం ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని 2014 ఎన్నికలకు మునుపు తిరుపతి వెంకన్న సాక్షిగా బీజేపీ హామీ ఇచ్చి మాట తప్పిందన్నారు. రాయలసీమతోపాటు ఉత్తరాంధ్రలో వెనకబడిన ఏడు జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలన్నారు. విభజన హామీల అమలుకు ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 5 వరకూ హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకూ బస్సు యాత్ర చేపట్టాలని తీర్మానించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లం రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రత్యేక హోదా సాధన సమితి జిల్లా కన్వీనర్ వేమయ్య యాదవ్, ఎస్కేయూ ప్రొఫెసర్ సదాశివ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.శివారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నాగార్జున పాల్గొన్నారు.

### సభకు తరలిన నాయకులు

ధర్మవరం: మందకృష్ణమాదిగ నాయకత్వంలో ఈనెల 11వ తేదిన బెంగళూరులో జరిగే జాతీయ మహాసభకు నియోజకవర్గం నుంచి కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బూదెప్ప పట్టణంలోని జగ్జీవన్ రాం విగ్రహం వద్ద నాయకులతో కలిసి నివాళులర్పించి బయలుదేరి వెళ్లారు.

## జగనన్నకు మద్దతివ్వండి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను పంపిణీ చేస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

బత్తలపల్లి: సంక్షేమ పథకాలతో ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతివ్వాలని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. పోట్లమర్రి పంచాయతీ పరిధిలోని వేల్పుమడుగు గ్రామంలో మంగళవారం ఆయన 'గుడ్ మార్నింగ్ ధర్మవరం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం జగన్ నెరవేర్చారని, వచ్చే ఎన్నికల్లో ఆయనకు మద్దతు ఇవ్వాలని కోరారు. లాస్ట్ చాన్స్ అంటూ మభ్య పెట్టే చంద్రాబాబునాయుడికి బుద్ధి చెప్పాలని ప్రజలకు సూచించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు తప్పెట ఆంజనేయులు, సర్పంచు అక్కిం దామోదర్, ఉప సర్పంచు కోళ్లమొర్రం చెన్నక్రిష్ణారెడ్డి, హనుమంతరెడ్డి, దామోదర్‌రెడ్డి, బాలక్రిష్టారెడ్డి, వైఎస్సార్‌విద్యార్థి విభాగం నాయకుడు నరేంద్రరెడ్డి, ఓబుళాపురం ఉప సర్పంచు బండి నాగభూషణ, బండి నారాయణస్వామి, దేవరప్ప పాల్గొన్నారు.

## సంక్రాంతి సంబరాల్లో విదేశీయులు



ముగ్గులను పరిశీలిస్తున్న విదేశీయురాలు

పుట్టపర్తి అర్బన్: గరాజుపల్లిలో ప్రభాత్ రూరల్ డవలప్‌మెంట్ మహిళా చేయూత కేంద్రం ఆధ్వర్యంలో పీఆర్‌డీఎస్ ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి, విదేశాలకు చెందిన సత్యసాయి భక్తులు మోనికా అన్నా ముల్లర్, అన్‌హటా సహకారంతో మంగళవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించగా 86 మంది మహిళలు పాల్గొని రంగవల్లులు వేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన తలారి సాయిలక్ష్మి, యామిని అనితాబాయికి బహుమతులు అందజేశారు.

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి సమీపంలోని సంస్కృతీ విద్యాసంస్థకు చెందిన కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు తెలుగు సంస్కృతికి అద్దం పట్టేలా చీరలు ధరించి అందమైన రంగవల్లులు రూపొందించి ఆకట్టుకున్నారు. కళాశాల అకడమిక్ డీన్ డాక్టర్ బాలకోటేశ్వరి సంక్రాంతి విశిష్టతను వివరించారు.

పుట్టపర్తి: బుక్కపట్నం జిల్లా ఉపాధ్యా శిక్షణ సంస్థలో ప్రిన్సిపాల్ రామకృష్ణ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ మునయ్య హాజరయ్యారు. విద్యార్థినులు చీరకట్టులో వచ్చి రంగవల్లులు రూపొందించి సంబరాలు నిర్వహించారు.

## సమన్వయంతో పనిచేస్తే మండలాభివృద్ధి



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ తదితరులు

పుట్టపర్తి అర్బన్: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధికి కృషి చేయాలి ఎంపీపీ ఏవీ రమణారెడ్డి సూచించారు. మంగళవారం జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను సక్రమంగా లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. ఎంఈఓ వెంకటరమణనాయక్ మాట్లాడుతూ మండలంలో మనబడి నాడు-నేడు పథకం కింద 49 పాఠశాలలకు గాను 45 పాఠశాలలు అభివృద్ధి చేస్తున్నామన్నారు. వ్యవసాయశాఖ ఏడీఏ సనావుల్లా మాట్లాడుతూ మండలానికి 3 డ్రోన్లు అందజేస్తారన్నారు. ఇంటర్ చదువుకున్న విద్యార్థులు 5 మంది గ్రూప్‌గా ఏర్పడి రూ.లక్ష చెల్లిస్తే రూ. 5 లక్షలు బ్యాంకు రుణంగా, రూ.4 లక్షల రాయితీతో డ్రోన్లు అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం పలు శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. వైస్ ఎంపీపీ హనుమంతరెడ్డి, ఎంపీటీసీలు కుళ్లాయప్ప, సరస్వతీబాయి, సర్పంచులు కామాక్షమ్మ, కుల్లాయి రెడ్డి, వెంకటేశు, లీలావతి, పెద్దన్న, శ్రీనివాసులు, ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, డీటీ నరసింహులు, ఏపీఎం శివమ్మ, జేఈ శశికుమార్ పాల్గొన్నారు.

### డిమాండ్ల సాధనకు ధర్నా

కదిరి టౌన్: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. యూనియన్ నాయకురాలు మాబున్నీసా మాట్లాడుతూ కనీస వేతనం రూ. 26 వేల ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ముదిగుబ్బ: వేతనాలు పెంచాలని సూపర్‌వైజర్ పోస్టుల భర్తీలో వయోపరిమితి తొలగించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నకుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు.